క్లుప్తంగా

క్రికెట్ పోటీల విజేత సుజనపేట టీమ్


క్రికెట్ విజేత సుజనపేట జట్టు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో నెల రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా సుజనపేట జట్టు నిలిచింది. గంగమ్మ తల్లి ఉత్సవాలను పురస్కరించుకుని క్రికెట్ పోటీలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. సుజనకోటలో సుజనపేట, దార్రెల జట్లు మధ్య ఫైనల్ పోరు హోరాహోరీగా జరిగింది. విజేతగా సుజనపేట జట్టు నిలిచింది. దార్రెల జట్టు రన్నర్‌గా సరిపెట్టుకుంది. ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు పలు పంచాయతీల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు వచ్చారు.

మూగజీవిని కాపాడిన విద్యార్థులు


గోతిలో పడిన మూగజీవిని బయటకు తీస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి: గోతిలో పడిన గేదె దూడను విద్యార్థులు అతి ప్రయాసతో కాపాడారు. మండల కేంద్రంలోని థియేటర్ సమీపంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు తీసిన గోతిలో ఓ మూగజీవి పడింది. ఆదివారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఆ మార్గంలో వెళ్తున్న విద్యార్థులు గోతులో పడిన గెదె దూడను గమనించారు. అందరూ కలిసి తాళ్ల సాయంతో మూగజీవిని బయటకు తీశారు. గేదెదూడ ప్రాణాలను కాపాడిన విద్యార్థులను స్థానికులు అభినందించారు.

రేపు రాజేంద్రపాలెంలో వైఎస్సార్ చేయూత సభ

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం అల్లూరి సీతారామరాజు స్మారక మందిర సమీపంలో చేయూత సభను మంగళవారం నిర్వహించనున్నట్టు మండల మహిళా సమాఖ్య ఆదివారం ప్రకటనలో తెలిపింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జడ్పీటీసీ వారా నూకరాజు, వివిధ కార్పోరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు పార్టీ శ్రేణులు రానున్నట్టు తెలిపారు.

ఘనంగా పోతురాజుబాబు ఉత్సవం


తీడలో పోతురాజుబాబును దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: తీడ గ్రామంలో కల్యాణం పోతురాజుబాబు ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కర్ర గుర్రాలు, ఏనుగులపై ఊరేగింపు నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వరకు సాగిన ఊరేగింపు సాగింది. అనంతరం ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలో తీర్థ మహోత్సవం జరిగింది. మహిళల అలంకరణ వస్తువులు, ఆట వస్తువులు, తినుబండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా వచ్చి పాల్గొన్నారు. చిన్నారులు తీర్థంలో సందడి చేశారు.

సోహం ఆశ్రమంలో ఆధ్యాత్మిక శోభ

అనకాపల్లి: మండలంలో బట్లపూడి సోహం ఆశ్రమంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మాఘమాసం ఆఖరిరోజు అమావాస్య రావడంతో ప్రదోష సమయంలో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు సోహం రవి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు చెప్పారు.

గ్రామాల్లో దాహార్తికి చెక్

- మండలంలో రూ.35 కోట్లతో 305 పథకాలు మంజూరు
- టెండర్ పూర్తయిన 165 పనులు
- ఇప్పటికే 37 పనులు పూర్తి చేసి తాగునీటి పనులు
- ఆనందంలో గిరిజనం





పంపు హౌస్


కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

పెదబయలు: నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరంలో గెడ్డలు, ఊటలను గిరిజనులు ఆశ్రయించేవారు..మండుటెండలో దూర ప్రాంతాలకు వెళ్లి అడుగంటిన జలాల నుంచి నీటిని గంటలకొద్దీ తోడి..తిరిగి ఇంటికి చేరేవారు. కలుషిత నీరు తీసుకోవడంతో రోగాల బారిన పడేవారు. గిరిజనులకు సకాలంలో వైద్యం అందక పరిస్థితి విషమించి మృత్యువాత పడిన సందర్భాలు అనేకం. మన్యంలో దశాబ్దాల తరబడి తాగునీటి సమస్య ఉంది... అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మన్యంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయలను మంజూరు చేశారు. గ్రామాల్లో దాహార్తి సమస్యకు చెక్ పెట్టింది. నేడు ఇంటింటికీ తాగునీరు అందిస్తోంది. దశాబ్దాల కల నెరవేరడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా పనులు : మండలంలోని తాగునీటి కష్టాలు పూర్తిగా తీర్చే లక్ష్యంగా ప్రభుత్వం తాగు నీటి పథకాల నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతోంది. మండలానికి 305 గ్రామాల్లో పూర్తి స్థాయిలో తాగునీరు అందించే లక్ష్యంగా రూ.35 కోట్ల మంజూరు చేసింది .అయితే ఇప్పటికే టెండర్ పూర్తయిన 165 పనులకు గాను ఇప్పటికే 37 గ్రామాల్లో పథకాలు పూర్తి చేసి తాగునీరు అందిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో మండలంలోని మిగిలిన అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా పనులు జోరుగా జరుగుతున్నాయి.మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనులు చేపడుతోంది. గ్రావిటీ ద్వారా నీరు అందించే పథకాలు వేగవంతంగా జరుగుతుంది.బోర్ వెల్ వేయడానికి రిగ్ వాహనం వెళ్లని గ్రామాలకు కొంత జాప్యం జరుగుతుంది.


రోగులపేటలో వాటర్ ట్యాంకు

నీటి ఎద్దడి తీరింది



గ్రామంలో రూ.13.30 లక్షలతో తాగునీటి పథకం పూర్తి చేసి నీరు అందించారు. దీంతో గ్రామానికి నీటి కష్టాలు తీరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డాం. గ్రామానికి సుదూరంలో ఉన్న గెడ్డలు, ఊటలను ఆశ్రయించేవారం. కలుషిత నీరు వినియోగించడంతో తరచూ రోగాల వచ్చేవి. జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చాక తాగునీటి కష్టాలు తీరాయి. ఇంటింటికీ కుళాయి వచ్చింది. సురక్షిత నీరు అందుతుంది.

– పెటియ రాధమ్మ, రోగులపేట గ్రామం

గడువులోగా పనులు పూర్తి



మండలంలో టెండర్ పూర్తయిన తాగునీటి పథకాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 37 గ్రామాల్లో తాగునీటి పథకాలు పూర్తి చేసి ఇంటింటా నీరు అందించడం జరుగుతుంది.మరో 13 గ్రామాలకు కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తాం. వేసవిలో తాగునీటి లేకుండా అన్ని గ్రామాల్లో గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.కురేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, పెదబయలు

జగనన్న ప్రభుత్వంలోనే మన్య ప్రాంతాభివృద్ధి


కర్లపల్లి-ముగమర్రి గ్రామానికి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మ


గురుగూడెంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లలిత, ఎంపీటీసీ మీనా


వాల్మీకి పేటలో బోరు పనులు

చింతపల్లిరూరల్: సంక్షేమ పథకాలతో పాటు మారుమూల గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మిల లిలిత, ఎంపీటీసీ సభ్యురాలు లువాబు మీనా కుమారి అన్నారు. మండలంలో చౌడుపల్లి పంచాయతీ గురుగూడెం గ్రామంలో పంచాయతీ నిధులు రూ.2 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో డ్రైయిన్ నిర్మాణ పనులకు వారు ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంతోనే మన్య ప్రాంతాభివృద్ధి సాధ్యమైందన్నారు. శివారు గ్రామాలకు మండలాలకు అనుసంధానంగా రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. నాయకుడు జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీలో కర్లపల్లి-ముగమర్రి గ్రామం వరకు మట్టి రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ జి పద్మ, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ ప్రారంభించారు. నాయకుడు కృష్ణమూర్తి, వార్డు నెంబర్లు భీమరాజు, సీతారాం, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంపచోడవరం: రంప గ్రామంలోని వాల్మీకిపేటలో మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, రంప సర్పంచ్ దేవీల ఆధ్వర్యంలో ఒక్క రోజులో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. వాల్మీపేటలో మంచినీటి సమస్య ఉందని గిరిజనులు వారి దృష్టికి తీసుకురావడంతో ఆదివారం చేతి బోరు ఏర్పాటు చేశారు. తక్షణం బోరు ఏర్పాటు చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞలు తెలిపారు. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు), ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిల ఆదేశాల మేరకు ఒక్క రోజులో ఏర్పాటు చేయడం సాధ్యమైందని పండా రామకృష్ణదొర, వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు మంగా తమ్మన్నకుమార్‌లు తెలిపారు. వార్డు మెంబరు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు శ్లాఘనీయం


పి.యర్రగొండలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ మాట్లాడుతూ మహిళా అక్షరాభివృద్ధికి సావిత్రిబాయి చేసిన సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


భీసుపురం సమీపంలోని కోతకు గురైన ప్రధాన రహదారి

ఆదమరిస్తే.. అంతే

అనంతగిరి: మండలంలోని భీసుపురం కాఫీతోటల సమీపంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారి కోతకు గురికావడంతో ప్రమాదంగా మారింది.. మూడు అడుగుల లోతుగా గొయ్యి ఏర్పడి వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఓహెచ్‌సీ కేబుల్ వేసేందుకు రోడ్డుని ఆనుకుని గోతులు తవ్వారు.. అయితే సక్రమంగా గోతులను పూడ్చక పోవడంతో వర్షాలకు పూర్తిగా కోతకు గురైంది. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలోని గోతుల్లో దిగి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


వంజరిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న మాజీ సర్పంచ్, నాయకుడు సీతారాంనాయుడు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం


దూసరపాములో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.మాడుగుల: మండలంలోని వంజరి, సింగర్భ, లువ్వాసింగి, రాసకొండ, తాడపాలెం, మడతకొండ, సుర్మతి, పినజాగేరి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, చేపట్టిన అభివృద్ధిని తెలియజేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. నాయకులు వి.సీతారాంనాయుడు, సింహాచలం, కన్వీనర్ పండుదొర, దిలీప్, బాలన్న, వలంటీర్లు గణేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మేము సిద్ధం-మా పోలింగ్ బూత్ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలు, ఎంత లబ్ధి చేకూరింది అనే వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను ప్రతి కుటుంబానికి అందజేశారు. స్థానికులు ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి కనపరచారు. వైఎస్సార్‌సీపీను మరోసారి అధికారంలోకి తీసుకొని వచ్చేందుకు ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని స్థానిక నాయకులు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సర్పంచ్ శివ, నాయకులు ముసలయ్య, రాంబాబు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు. కింద్రలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మేము సిద్ధం-మాబూత్ సిద్ధం కార్యక్రమం జరిగింది.

మెరుగైన వైద్యం..ఆనందంలో గిరిజనం

- వై.రామవరం సీహెచ్‌సీలో పెరుగుతున్న ఓపీ
- అందుబాటులో అన్ని వైద్య పరీక్షలు
- నిరంతరం వైద్యుల పర్యవేక్షణ
- కోట్లాది రూపాయలతో అదనపు భవనాలు, మౌలిక సదుపాయాలు


వై.రామవరం సీహెచ్‌సీ


ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

వై.రామవరం: మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం మెరుగైన వైద్య సేవలకు పేరు పొందింది. ఈ ఆస్పత్రిలో నిరంతరం అందుబాటులో వైద్యులు, సిబ్బందితో పాటు ఆధునిక సదుపాయాలు, అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు ఉండడంతో మండల కేంద్రంతో పాటు సమీప ప్రాంత వాసులకు ఎంతగానో ఆదుకుంటుంది. ఇక్కడున్న పీహెచ్‌సీకి అడ్డతీగల, కొయ్యూరు మండలాలకు చెందిన రోగులు వస్తుంటారు. రోజూ ఓపీ సుమారు 60 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఆస్పత్రిలో అన్ని రక్తపరీక్షలు చేసే ల్యాబ్, ఎక్స్‌రే ప్లాంట్, మినరల్ వాటర్ ప్లాంట్, స్కానింగు మిషన్లు, ప్రతీ వార్డుకు సరఫరా చేసే ఆక్సిజన్ ప్లాంటు, ఇన్వర్టర్లు, జనరేటర్ సదుపాయం ఉంది. ఆస్పత్రిలో ఐదుగురు వైద్యాధికారులు, సుమారు 50 మంది సిబ్బంది 24 గంటలు సేవలు అందిస్తున్నారని, శిశువుల కోసం ప్రత్యేక ఎస్ఎన్‌సియు వార్డు ఉన్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్ చెప్పారు.


డాక్టర్ రాహుల్,ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆసుపత్రిని 50 పడకలు ఆసుపత్రిగా మార్చే దిశలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తు, రూ. 5.65 కోట్లతో ఆసుపత్రిపైన 2వ అంతస్తుగా అదనపు గదులు, ఇన్ పేషెంటు వార్డులు, తదితర అభివృద్ధి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు. వెంటిలేటర్స్, ఆక్సిజన్, ఇద్దరు ప్రత్యేక వైద్యాధికారి, సిబ్బంది, తదితర అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆస్పత్రిలో పాముకాటుకు, కుక్క కాటుకు వ్యాక్సిన్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ప్రసవాలు అనంతరం తల్లీబిడ్డలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నామన్నారు. అలాగే ఆసుపత్రికి ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీంతోపాటు వై.రామవరంలో 108, 104 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాకుండా 4 ఫీడర్ అంబులెన్స్‌లును కూడా ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. పేద ప్రజలకోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిఏంచిన సకల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ కోరారు.

కనులపండువగా శివపార్వతుల ఊరేగింపు


శివపార్వతుల పల్లకి ఊరేగింపులో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి ఆదివారం పురవీధుల్లోకి వచ్చిన శివపార్వతుల పల్లకి ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. అడుగడుగున ఊరేగింపునకు ఎదురు వెళ్లి పండ్లు, పూలు సమర్పించారు. మేళతాళాల నడుమ జరిగిన శివపార్వతుల ఊరేగింపుతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నేడు చౌడుపల్లిలో పాడేరు సమన్వయకర్త పర్యటన

చింతపల్లిరూరల్: చౌడుపల్లి పంచాయతీ పరిధిలో పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు సోమవారం పర్యటించనున్నట్టు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధిని,అందుతున్న సంక్షేమ పథకాల కొసం గిరిజనులకు అవగాహన కల్పిస్తారన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా రోడ్డు పనులు


కామయ్యపేటలో జరుగుతున్న రహదారి పనులు

హుకుంపేట: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కామయ్యపేట ప్రధాన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కామయ్యపేట నుంచి అల్లంపుట్టు గ్రామం వరకు రూ.1.10కోట్ల వ్యయంతో జరుగుతున్న పనులు వేగవంతం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతానికి ప్రధాన రహదారి కావంతో ఈ రోడ్డు మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు జరుగుతాయని, ఎన్నో ఏళ్లగా రహదారి సరిగ్గా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని చెప్పారు. ప్రస్తుతం చేపడుతున్న పనులతో సమస్య పరిష్కారమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పెదబయలు: మండలంలో ముమ్మరంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఫారం పాండ్, నీరు నిల్వ చేసే పనులు, పంట కాలువలు, భూమి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఉపాధి పనులకు రోజు వారీగా కూలీలు పెరిగారని, రోజు 3,500 నుంచి 3,800 మంది పనులకు హాజరవుతున్నట్టు ఉపాధి ఏపీవో చిన అప్పలనాయుడు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ కూలికి వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించామని, గ్రామాల్లో కొత్త పనులు గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

12న వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

కూనవరం: మండల కేంద్రంలో ఈనెల 12న జరగనున్న వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అడ్డతీగల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీసు మైదానంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జరగనున్న కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతఉదయభాస్కర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కూనవరం, విఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల్లోని వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం జమ చేసిన సొమ్ముకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు హాజరు కావాలని కోరారు.

కొండచీపుళ్లకు గిరాకీ

- ఒక్కోటి రూ.60 నుంచి రూ.70లకు విక్రయాలు
- ఆశాజనకంగా లాభాలు

అనంతగిరి: ఏజెన్సీలోని గిరిజనులు అడవులపై ఆధారపడి జీవిస్తుంటారు.. సీజన్లకు తగ్గట్టు అటవీ ప్రాంతాల్లో ఉత్పత్తులను సేకరించి, సమీపం ప్రాంతాల్లో అమ్మకాలు చేపడుతూ జీవనోపాధి పొందుతుంటారు.. ప్రస్తుతం కొండచీపుళ్ల సీజన్ ప్రారంభమైంది. గిరిజన ప్రాంతంలోని దొరికే కొండచీపుళ్లకు మైదాన ప్రాంతాల్లో భారీగా డిమాండ్ ఉండడంతో కొంతమంది గిరిజనులు పెరట్లో కొండ చీపుళ్ల సాగుపై దృష్టి సారించగా.. మరికొంత మంది గిరిజనులు అడవుల్లో దొరికే కొండచీపుళ్లను సేకరించే పనిలో నిమగ్నమైయ్యారు..


వారపు సంతకు ఆటోలో తరలిస్తున్న కొండచీపుళ్లు


కొండచీపుళ్లను మోసుకుని వస్తున్న గిరిజనుడు

వారపు సంతల్లో అమ్మకాలు

వారపు సంతల్లో కొండచీపుళ్లను అమ్మకాలు చేపడుతున్నారు. మైదాన ప్రాంతాల వ్యాపారులు వారపు సంతలకు వచ్చి, గిరిజనులు నుంచి కొండచీపుళ్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది ఒక్కో కొండచీపురు రూ.40 నుంచి రూ.50 విక్రయించగా, ఈ ఏడాది రూ.60 నుంచి రూ.70 ధరతో విక్రయిస్తుండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధరతో కొండచీపుళ్ల అమ్మకాలు జరుగుతున్నాయని ఆనంద పడుతున్నారు.